కొడంగల్‌లో ఎనుముల రాచరిక పాలన

అధికారిక కార్యక్రమాల్లో తిరుపతిరెడ్డి ఎవరు?: కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలువని తిరుపతిరెడ్డి ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ఏ హోదాతో పాల్గొంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తిరుపతిరెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఫొటోలను జత చేసి సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వార్డు మెంబర్‌గా కూడా గెలువని వ్యక్తికి సీఎం స్థాయి అధికారాలు ఉన్నాయంటే అది ఎనుముల రాచరిక పాలనలోనే సాధ్యమవుతున్నదని వ్యాఖ్యానించారు

ఏడాదిలోనే ఎనలేని అప్పులు !

ఆరు గ్యారెంటీలు అమలైందే లేదు కానీ లెక్కకుమించిన అప్పులు దేనికోసం చేశారని కేటీఆర్ కాంగ్రెస్ సర్కార్‌ను ప్రశ్నించారు. 'పిడికెడు మన్ను తీసింది లేదు.. కొత్తగా కట్టిందేమీ లేదు.. రుణ మాఫీ పూర్తి చేయలేదు.. రైతు భరోసా ఇయ్యనేలేదు. 2 వేల పింఛను 4 వేలు కాలేదు. ఆడబిడ్డలకు 2500 ఇవ్వలేదు. తులం బంగారానికి దిక్కేలేదు. కేసీఆర్ కిట్టు లేదు. న్యూట్రిషన్ కిట్ రాలేదు. లక్షన్నర కోట్లు తెచ్చి ఎవరి పాలు చేశారు?' అని ప్రశ్నించారు. పదేండ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధికి 4 లక్షల కోట్ల అప్పు చేస్తే విషప్రచారం చేస్తున్నారంటూ కేటీఆర్ కవితాత్మకంగా రేవంత్ సర్కార్‌పై సెటైరికల్ ట్వీట్ చేశారు.

కాళేశ్వరం కట్టి, పాలమూరు రంగారెడ్డి కట్టి, సీతారామసాగర్ కట్టి.. వందల టీఎంసీల రిజర్వాయర్లు నిర్మించి.. మిషన్ కాకతీయ కింద చెరువులు, కుంటలు బాగుచేసి, మిషన్ భగీరథ కింద ఇంటింటికి మంచినీళ్లిచ్చి, రైతుబంధు ఇచ్చి, రైతుబీమా ఇచ్చి, కల్యాణలక్ష్మి ఇచ్చి, ఆసరా పింఛన్లతో అండగా నిలిచి, వెయ్యికిపైగా సంక్షేమ గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసి, పల్లెప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారంతో పచ్చదనం పెంచి, 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చి, అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టి, దశదిశలా తెలంగాణ వైభవాన్ని చాటి, పదేండ్లలో 4 లక్షల కోట్ల అప్పు చేసిన కేసీఆర్ ప్రభుత్వం మీద విషప్రచారం చేసిన సన్నాసులు, కేవలం ఏడాది పాలనలో.. లక్షన్నర కోట్ల అప్పు ఎందుకు చేశారో..

ఎందుకు ప్రశ్నించరు ?
జాగో తెలంగాణ జాగో!

లాయర్‌తో వస్తే భయమెందుకు?

మొదటిపేజీ తరువాయి...

స్టేట్‌మెంట్ ఇచ్చి ఇబ్బందులు పెట్టారని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు తాను ఒక్కడ్నే వెళ్తే.. లేనిపోని ఆరోపణలు, నిందలు వేసి, తాను మాట్లాడని మాటలు కూడా వక్రీకరించి, తప్పుడు స్టేట్‌మెంట్ రికార్డు చేసే అవకాశం ఉందని, అందుకే తాను లాయర్‌తోనే విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు. 'నా తరపు న్యాయవాదితో విచారణకు వెళ్లడం నా హక్కు. అది రాజ్యాంగం కల్పించింది. దానిని కూడా ఎందుకు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదు' అని కేటీఆర్ అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, పోలీసులు కాలరాస్తున్నారని విమర్శించారు. 'పట్నం నరేందర్‌రెడ్డి చెప్పని మాటలు కూడా కలిపి.. తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చి.. 40 రోజులు అతన్ని జైల్లో ఉంచారు. అందులో నా పేరు చెప్పించి, నన్ను ఇరికించే ప్రయత్నం చేశారు. ఇక్కడ కూడా నేను చేయంది ఏదో చేశానని.. తన అనుకూల మీడియాకు లీకులిచ్చి, దేశమంతా టాంటాం చేయాలనే కుట్ర జరుగుతున్నది. అలా జరగొద్దంటే నాకు న్యాయపరమైన సపోర్ట్ కావాలనే లాయర్‌తో వచ్చాను' అని వివరించారు. కాంగ్రెస్ పాలనలో పోలీసు డిపార్ట్‌మెంట్ తప్పుడు స్టేట్‌మెంట్‌లు ఇప్పించడంలో ఆరి తేరిందని, ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో.. దర్శక దిగ్గజం రాజమౌళి కంటే ఎక్కువగా స్క్రిప్ట్‌లు, స్టేట్‌మెంట్‌లు తయారు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్వాష్ పిటిషన్ కోర్టులో ఉన్నా.. విచారణకొచ్చా

ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ తాను వేసిన క్వాష్ పిటిషన్‌పై వాదనలు జరిగాయని, హైకోర్టు తీర్పును రిజర్వు చేసిందని కేటీఆర్ తెలిపారు. 'ఈ అంశాన్ని చూపించి ఏసీబీకి లేఖ రాసి నేను రాకుండా ఉండొచ్చు. నేను అలా చేయలేదు. బాధ్యత గల వ్యక్తిగా విచారణకు వచ్చాను. నా లాయర్‌తో ఎందుకు అనుమతించరు?.. ఈ కేసులో ఏం జరిగిందో వాస్తవాలు చెప్పడానికే వచ్చాను. అయినా నన్ను అనుమతించడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'క్వాష్ పిటిషన్ కోసం ఇచ్చిన అఫిడవిట్‌లో నేను అన్ని విషయాలు వివరంగా చెప్పాను. సంబంధించిన డాక్యుమెంట్స్ ఇచ్చాను' అని వివరించారు. 'ఒకవేళ నేను లాయర్ లేకుండా వెళ్తే.. వందశాతం నాపై తప్పులు బనాయిస్తారు. నేను కేసును ఒప్పుకున్నానని, ఏదో తప్పులు చేశానని, ఇదే అనుకూల మీడియా బ్రేకింగ్‌లు వేస్తుంది. రేవంత్‌ను నేను నమ్మను కాబట్టే.. లాయర్‌తో వస్తానని చెప్పా' అని తెలిపారు.

ఏ తప్పూ చేయలేదు

'ఈ రోజు నా మామ రెండో సంవత్సరీకం. ఇంట్లో ఆ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ సంవత్సరీకం, ఆ పూజల మీద కూడా పడి.. మేము దాడులు చేస్తామని బెదిరిస్తున్నారు. మీరు అంతలా దిగజారి చేస్తానంటే చేసుకోండి' అంటూ కేటీఆర్ మండిపడ్డారు. 'నేను ఏ తప్పూ చేయలేదు. నిజాయితీగా ఉన్నాను కాబట్టే.. విచారణకు వచ్చాను. కానీ లాయర్‌ను తీసుకెళ్తానంటే వీళ్లకు ఎందుకు భయమవుతున్నదో అర్థం కావట్లే. ఇందులో దాపరికం ఏముంది?' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గతంలో కూడా ఫ్యామిలీ దావత్ చేసుకుంటుంటే 150 మంది పోలీసులతో వచ్చి రేవంత్ ప్రభుత్వం దాడులు చేసింది. కుక్కలను తీసుకొచ్చి డ్రగ్స్ కోసం వేటాడారు. సీఎంగారు ఏకంగా అసెంబ్లీలోనే డ్రగ్స్ దొరికాయని అబద్ధాలు చెప్తారు. ఆ నీతిమాలిన మనిషితో ఇంతకంటే ఎక్కువ ఎక్స్‌పెక్ట్ చేయలేం' అని మండిపడ్డారు.

ఇదంతా.. డైవర్షన్ పాలిటిక్స్ కోసమే!

'రేవంత్ చేస్తున్న ఈ పన్నాగమంతా డైవర్షన్ పాలిటిక్స్ కోసమే. రాహుల్‌గాంధీ, ఖర్గే, సోనియాగాంధీ ఇచ్చిన మాట, మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా రైతులకు ఇస్తామన్న 15 వేలు ఇవ్వడం లేదు. రైతుల నుంచి వచ్చే వ్యతిరేకతను కప్పి పుచ్చేందుకు ఈ డైవర్షన్ పాలిటిక్స్‌ను వాడుతున్నాడు. ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చినప్పుడల్లా ఏదో ఒక అంశాన్ని తన అనుకూల మీడియా ద్వారా తెరమీదకు తెస్తున్నాడు' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను రైతులకు, కార్యకర్తలకు, నాయకులు చేసే విజ్ఞప్తి ఒక్కటే.. ఈ కేసు లో ఎలాంటి పస లేదు. దీని వల్ల రేవంత్ సాధించేదేమీ లేదు' అన్నారు.

ఏసీబీ కేసు తేలిన తర్వాతే.. ఈడీ వద్దకు!

'ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ మీద క్వాష్ పిటిషన్ వేశాను. ఇవాళ ఏసీబీ విచారణకు వచ్చాను. ఈ హంగామా కేసు తేలిన తర్వాతే ఈడీ ముందుకు వెళ్లేది లేనిది చెప్తాను. ప్రస్తుతం ఈ కేసు విచారణ ఏంటో తేలాలి' అని కేటీఆర్ అన్నారు. 'రేవంత్‌రెడ్డి ఏం చెబితే.. అది మీడియాలో ప్రసారం అవుతుంది. ఆ స్థాయిలో లీకులు ఇస్తున్నారు. ప్రతిదీ డ్రామా చేస్తున్నారు. అందుకే ఫస్ట్ ఈ ఏసీబీ కథేందో తేల్చాలి' అని కేటీఆర్ అన్నారు. మీరు భయపడుతున్నారా? అన్న మీడియా ప్రశ్నకు 'నేనేం రేవంత్‌రెడ్డిలాగ లుచ్చాపనులు చేయలేదు. నేను భయపడను. ప్రస్తుతం ఏసీబీ ఆఫీసు ముందే ఉన్నా..' అని కేటీఆర్ ఘాటుగా స్పందించారు.

> నా ఇంట్లో ఉత్తుత్తి తనిఖీలు చేపట్టి, కొన్ని డాక్యుమెంట్లు ఇంట్లోకి దొడ్డిదారిన చొప్పించి.. ఈ కేసులో నన్ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని నాకు విశ్వసనీయ సమాచారం ఉంది. ఇది రేవంత్‌రెడ్డి క్రిమినల్ మైండ్‌సెట్. - కేటీఆర్



తెలంగాణభవన్‌లో మైనార్టీల భారీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు

ఎలక్టోరల్ బాండ్లపై చర్చకు సిద్ధమా?

ఫార్ములా-ఈ రేసు నిర్వహణ సంస్థల్లో ఒకటైన గ్రీన్‌కో కంపెనీ బీఆర్ఎస్‌కు లంచం ఇచ్చిందని, క్విడ్ ప్రోకో విధానంలో డబ్బులు చెల్లించారన్న ఆరోపణలపై పలువురు మీడియా మిత్రులు వేసిన ప్రశ్నలకు కేటీఆర్ వివరణ ఇచ్చారు. గ్రీన్ కో అనే కంపెనీ దేశంలోని అన్ని పార్టీలకు ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిందని చెప్పారు. పార్లమెంట్ ఆమోదించిన ఎలక్టోరల్ బాండ్లు ఇవ్వడం అవినీతి అని ఎలా అంటారని ప్రశ్నించారు. గ్రీన్ కో కంపెనీ ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చింది 2022లో అయితే.. ఫార్ములా - ఈ రేసు జరిగింది 2023లో అని కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. బీఆర్ఎస్‌కు బాండ్లు ఇచ్చిన అదే కంపెనీ.. కాంగ్రెస్, బీజేపీకి కూడా ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని పార్టీలకు వచ్చిన ఎలక్టోరల్ బాండ్లపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు. అయితే, ఫార్ములా ఈ-కార్ రేసు కారణంగా గ్రీన్ కో అనే కంపెనీ నష్టపోయిందని, అలా నష్టపోయిన సంస్థలెవరైనా ఉల్లా లంచాలు ఇస్తాయా? అని కేటీఆర్ ప్రశ్నించారు. పనికిమాలిన ఆరోపణలను వదిలేసి.. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల బాగోగుల గురించి ఆలోచించాలని కేటీఆర్ హితవు పలికారు.

హైకోర్టు తీర్పు వచ్చే వరకూ రాలేను!

ఈడీకి సమాధానం పంపిన కేటీఆర్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేసింగ్ కేసులో 7న విచారణకు హాజరుకావాలని ఈడీ అధికారులు ఇచ్చిన నోటీసులకు కేటీఆర్ స్పందించారు. సోమవారం ఈడీ అధికారులకు సమాధానం పంపారు. ఏసీ బీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును రిజర్వులో ఉంచిందని తెలిపారు. ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువడేంతవరకు ఈ అంశంలో తనకు సమయం ఇవ్వాలని ఈడీ అధికారులను కేటీఆర్ కోరారు. అందుకు ఈడీ అంగీకారం తెలుపుతూ.. తదుపరి తేదీని త్వరలో వెల్లడిస్తామని ప్రకటించింది.

క్వాష్ పిటిషన్‌పై నేడు తీర్పు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేస్ నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనున్నది. కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఇప్పటికే ఏసీబీని ఆదేశించడంతోపాటు దర్యాప్తునకు సహకరించాలని కేటీఆర్‌కు సూచించింది. సోమవారం ఆయన తన న్యాయవాదిని వెంటబెట్టుకుని ఏసీబీ దర్యాప్తునకు వెళినప్పటికీ పోలీసులు అనుమతించలేదు. దీంతో న్యాయవాదిని అనుమతించకపోవడం తన హక్కులకు భంగం కలిగించడమేనని, ఏసీబీ ఉద్దేశపూర్వకంగా తన న్యాయవాదిని అడ్డుకుంటున్నదని కేటీఆర్ చెప్పారు.

ఏసీబీ అర్థం మార్చిన రేవంత్‌రెడ్డి..

ఏసీబీ అర్థాన్ని ముఖ్యమంత్రి పూర్తిగా మార్చివేశారని కేటీఆర్ విమర్శించారు. 'యాంటి కరప్షన్ బ్యూరోను కాస్తా.. ఎనుముల కానిస్పిరసీ బ్రాంచ్ (ఏసీబీ)గా మార్చారు. సీఎం కనుసన్నల్లోనే పోలీసులు, ఏసీబీ వంటి దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయి' అని పేర్కొన్నారు. తాను మంత్రిగా నిర్ణయం తీసుకున్నానని, అందుకు సంబంధించిన చెల్లింపులు, నిబంధనలు చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని అన్నారు. కోర్టు తీర్పు రిజర్వ్ అయినప్పటికీ ఏసీబీ నోటీసులు ఇచ్చినా.. బాధ్యతతో విచారణకు వచ్చానని కేటీఆర్ చెప్పారు. 40 నిమిషాలు వేచి చూసిన అనంతరం.. ఏసీబీ విచారణాధికారి ఏసీపీ ఖాన్ రావడంతో ఆయనకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దీంతో ఆయన అది తీసుకున్నట్టు సంతకం చేశారు.

లోకం పోకడ



కేటీఆర్‌ను జైలుకు పంపే కుట్ర

సీఎం రేవంత్‌రెడ్డిది రాజకీయ కక్ష
ఏసీబీ విచారణకు వెళ్తుంటే అడ్డగింత
ప్రజాగ్రహం తప్పదు: బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఏసీబీ విచారణకు వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌వెంట న్యాయవాదిని అనుమతించకపోవడంపై పలువురు పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. న్యాయవాది సమక్షంలో విచారణ చేయకుండా తప్పుడు స్టేట్‌మెంట్‌ను సృష్టించేందుకే ఈ కుట్రచేశారని ధ్వజమెత్తారు. ఏసీబీ పిలవగానే స్వచ్ఛందంగా వెళ్లిన కేటీఆర్‌ను బద్నాం చేయాలనే ఉద్దేశంతోనే రేవంత్‌రెడ్డి సర్కార్ ఇలా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి చేతిలో తోలుబొమ్మలా ఏసీబీ పనిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతి అసలే లేని ఈ కేసులో ఏదో ఒకరకంగా కేటీఆర్‌ను జైలుకు పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి పన్నాంగం పన్నుతున్నారని విమర్శించారు.

రేవంత్‌రెడ్డి కాదు రివేంజ్‌రెడ్డి: మహమూద్ అలీ

సీఎం పేరు రేవంత్‌రెడ్డి కంటే రివేంజ్‌రెడ్డి అని పెట్టుకుంటే సరిపోతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ఎద్దేవా చేశారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో నిబంధనల మేరకే నగదు బదిలీ జరిగిందని, ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలను వేధింపులకు గురిచేయాలనే కుట్రలో భాగంగానే కేటీఆర్‌పై కేసు నమోదుచేశారని విమర్శించారు.

లగచర్ల నుంచే పతనం షురూ : గువ్వల బాలరాజు

లగచర్లలో లంబాడీ రైతులను వేధించిన నాటి నుంచే కాంగ్రెస్ వినాశనం మొదలైందని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెల్పిచెప్పారు. కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టడంతో రేవంత్ సర్కార్ మరింత ప్రజాగ్రహానికి గురైందని తెలిపారు. న్యాయవాదితో సహా వెళ్లిన కేటీఆర్‌ను అడ్డుకోవడం ప్రజలను డైవర్ట్ చేసేందుకేనని చెప్పారు.

రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్: పల్లె రవికుమార్

రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి 12 వేలకు తగ్గించడంతో ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామనే అక్కసుతోనే సీఎం రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని గీత కార్మిక కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ విమర్శించారు. కాంగ్రెస్ మోసాలను బట్టబయలు చేస్తున్నారనే కేటీఆర్‌ను జైలుకు పంపేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. విచారణకు న్యాయవాదిని తీసుకెళ్తే ఏసీబీ ఎందుకు అభ్యంతరం తెలుపుతుందని ప్రశ్నించారు.

అవినీతి ఎక్కడిది: గజ్జల నగేశ్

ఫార్ములా ఈ రేస్‌లో అవినీతి ఎక్కడ జరిగిందని కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నగేశ్ ప్రశ్నించారు. అవినీతి అన్నదే లేకున్నా కేటీఆర్‌పై రాజకీయ కక్షతోనే రేవంత్‌రెడ్డి కేసు నమోదు చేయించి వేధిస్తున్నాడని విమర్శించారు. అభివృద్ధి చేయడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి తప్పుడు కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డిది పైశాచికానందం: విజయ్‌కుమార్

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని బీఆర్ఎస్ నేత కురువ విజయ్‌కుమార్ ఆరోపించారు. పాలన చేతగాకే తప్పుడుమార్గంలో వెళ్తున్నారని విమర్శించారు.

న్యాయవాదితో వెళ్లడం ప్రాథమిక హక్కు

తప్పుడు ఉద్దేశంతోనే కేటీఆర్‌కు ఏసీబీ అనుమతి నిరాకరణ: న్యాయవాది సోమా భరత్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): 'రాజ్యాంగంలోని ఆర్టికల్-21 ప్రకారం దర్యాప్తు సంస్థల వద్దకు విచారణకు వెళ్లే వ్యక్తి లాయర్‌ను వెంట తీసుకెళ్లొచ్చు. కానీ, కేటీఆర్ విషయంలో ఏసీ బీ ఇందుకు విరుద్ధంగా వ్యవహరించింది. తప్పుడు ఉద్దేశంతోనే అనుమతి నిరాకరించినట్టు అర్థమవుతున్నది' అని ప్రముఖ న్యాయవాది సోమా భరత్ వ్యాఖ్యానించారు. న్యాయవాది అంటే కోర్టు అధికారి అనే విషయాన్ని పట్టించుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సోమవా రం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడు తూ.. విచారణకు వెళ్లిన వ్యక్తిని డాక్యుమెంట్లు అడగడం విడ్డూరమని చెప్పారు. కేటీఆర్‌ను విచారణకు పిలిచి ఏసీబీ ఆఫీసులోనికి రానివ్వకపోడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఆయనను గేట్ దగ్గరే నిలువరించిన పోలీసులు ఎవరితోనో ఫోన్లో మాట్లాడటం ఆక్షేపణీయమని అన్నారు. కేసు విచారణ ఇప్పటికే కోర్టు పరిధిలో ఉన్నదని గుర్తుచేశారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

కేటీఆర్‌ను బద్నాం చేసే కుయుక్తి

- కుట్రలపై కుట్రలు చేస్తున్న సీఎం రేవంత్
- రైతుల దృష్టిని మళ్లించేందుకే నోటీస్
- ఏడాదిలోనే విఫలమైన ఏకైక సీఎం
- సమైక్య పాలనను గుర్తు చేస్తున్న సర్కార్
- మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): నిత్యం ప్రజాసమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులతో బద్నాం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుయుక్తులతో కుట్రలకు దిగుతున్నారని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏడాది పాలనలో రేవంత్ అన్నింటిలోనూ విఫలమయ్యారని, అందుకే ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రైతుభరోసాపై అన్నదాతలు ఆగ్రహిస్తున్నారనే, ఫార్ములా వన్ కేసును మళ్లీ తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్‌తో హైదరాబాద్‌ను విశ్వవ్యాప్తం చేసిన కేటీఆర్ పైనే కేసులు పెట్టడం రేవంత్ దుష్టపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సత్తా చూపుతాం

సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూశారని మధుసూదనాచారి గుర్తు చేశారు. అదే తరహాలో ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి కోతలు, కూల్చివేతలు తప్ప మరేం చేతకావడం లేదని మండిపడ్డారు. పదేండ్ల పాలనలో దేశంలో ఏ ప్రభుత్వానికి రానన్ని అవార్డులు, రివార్డులు సాధించిన ఘనత కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వ వేధింపులను ఆపకుంటే బీఆర్ఎస్ సత్తా ఏమిటో చూపుతామని మధుసూదనాచారి హెచ్చరించారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, మెతుకు ఆనంద్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్

తెలంగాణలో రేవంత్ రాజ్యాంగం

- ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న సీఎం
- తప్పుడు కేసులను ఎదుర్కొంటాం
- నిత్యం నిలదీస్తున్నందుకే కేటీఆర్‌పై కేసు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 6 (నమస్తేతెలంగాణ): తెలంగాణలో రేవంత్‌రెడ్డి రాజ్యాంగం నడుస్తున్నదని, ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి, జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడబోదని స్పష్టంచేశారు. రేవంత్ రాచరిక రాజ్యాంగాన్ని అంబేద్కర్ రాజ్యాంగంతో తిప్పికొడతామని హెచ్చరించారు. హామీలు అమలు చేయాలని నిత్యం నిలదీస్తున్నందుకే కేటీఆర్‌పై ఫార్ములా-ఈ రేస్ కేసుపెట్టి ఇబ్బందిపెడుతున్నారని ఆరోపించారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ ఓట్ల కోసం మహిళలకు ప్రతినెలా రూ.2,500, కల్యాణలక్ష్మి కింద రూ.లక్ష తోపాటు తులం బంగారం, రైతాంగానికి ఎకరాకు రూ.15వేల రైతుభరోసా ఇస్తానని తప్పుడు హామీలు గుప్పించారని విమర్శించారు. ఏడాది పాలనలో ఏ ఒక్క మంచిపని కూడా చేయని సీఎం పేరును ప్రజలు కూడా గుర్తుంచుకోవడంలేదని చెప్పారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో రేవంత్ పేరు మరిచిపోయిన యాంకర్‌ను జైలుకు పంపే ప్రమాదం ఉన్నదని చమత్కరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, మెతుకు ఆనంద్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏసీబీ ఆఫీసు వద్ద హైడ్రామా

విచారణకు వచ్చిన కేటీఆర్‌ను అడ్డుకున్న ఏసీబీ • లాయర్‌తో వస్తే అనుమతించబోమని స్పష్టీకరణ

- న్యాయవాదితోనే వస్తానని తేల్చి చెప్పిన కేటీఆర్
- లిఖితపూర్వంగా స్టేట్‌మెంట్ ఇచ్చి వెళ్లిపోయిన కేటీఆర్
- 9న హాజరుకావాలంటూ మరో నోటీసు ఇచ్చిన ఏసీబీ

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విచారణకు హాజరైన సమయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు హైడ్రామా నడిపించారు. ఏసీబీ నోటీసుల మేరకు కేటీఆర్ తన న్యాయవాదులను తీసుకొని సోమవారం ఉదయం 10 గంటలకే బంజారాహిల్స్‌లోని ఏసీబీ ఆఫీసుకు చేరుకోగా అధికారులు గేటు బయటే ఆయనను అడ్డుకున్నారు. దాదాపు 40 నిమిషాలపాటు పోలీసులు కేటీఆర్‌ను కారులోనే కూర్చోబెట్టి హైడ్రామా నడిపించారు. తమ విచారణకు కేటీఆర్ ఒక్కరే రావాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు. తనతో లాయర్ రావాల్సిందేనని, ఏసీబీ అధికారులు తప్పుడు స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తే దానికి ఎవరు బాధ్యులని కేటీఆర్ మీడియా సాక్షిగా ప్రశ్నించారు. దీంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు కేటీఆర్ దగ్గరకు విచారణాధికారి మాజిద్ అలీఖాన్‌ను పంపారు. ఆయనతో సహా అక్కడున్న పోలీసులు కేటీఆర్‌ను విచారణకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే, ప్రభుత్వ తీరుపై తనకు నమ్మకం లేదని, తాను లాయర్‌తో విచారణకు వస్తే భయమెందుకు? అని కేటీఆర్ ప్రశ్నించారు. సీఆర్పీసీ నోటీసుల ప్రకారం విచారణకు వస్తే.. లాయర్లు అవసరం లేదని ఏసీబీ అధికారులు చెప్పారు. లాయర్‌తో విచారణకు రావడం తన ప్రాథమిక హక్కు అని కేటీఆర్ వారికి వివరించారు. కొద్దిసేపు తర్జనభర్జన అనంతరం.. లాయరు లేకుండానే విచారణకు రావాలని ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను ఆదేశించారు. ఈసారి కూడా కేటీఆర్.. లాయర్‌తోనే విచారణకు హాజరవుతానని స్పష్టంచేశారు. అప్పటికే దాదాపు 40 నిమిషాలు కావడంతో.. ఆ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు కేటీఆర్ వాహనాన్ని కొంచెం లోపలికి అన